నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, మంగళవారం 2 ఏప్రిల్ 2024 | HYDERABAD


సోమవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ రహత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తదితరులు -అంబర్‌పేట, ఏప్రిల్ 1


మిలిటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజినీరింగ్(ఎంసీఈఎంఈ) 75వ కల్నల్ కమాండెంట్‌గా సోమవారం లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్ష్నే బాధ్యతలు స్వీకరించారు. 1 ఈఎంఈ సెంటర్ వార్ మెమోరియల్ వద్ద అమరవీరుల స్థూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ రక్షణలో వివిధ విభాగాల్లో కీలక పాత్ర పోషించిన లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్ష్నేకు మిలటరీ అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. -బొల్లారం, ఏప్రిల్ 1

## ఆశీర్వదించండి..అభివృద్ధి చేస్తా



చేవెళ్ల ఎంపీగా నాకు అవకాశం కల్పిస్తే ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా. గతంలో రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా సేవలందించా. అప్పట్లో గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు అందించాను. ఈ నెల 13న కేసీఆర్ చేవెళ్ల నుంచి ఎన్నికల శంఖరావాన్ని పూరించబోతున్నారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలందరూ కారు గుర్తుకు ఓటు వేసి నన్ను భారీ మెజార్టీతో గెలిపించాలి.

- కాసాని జ్ఞానేశ్వర్, చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి

## సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలి



పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ అందించిన పథకాలను ప్రజలకు వివరించాలి. అన్ని వర్గాల సంక్షేమానికి బీఆర్ఎస్ సర్కారు పథకాలు అమలు చేసింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన బీసీ నేత, సీనియర్ నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలి. పేదలకు అందించిన పథకాల గురించి ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయాలి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఇబ్బందులు పెడుతున్న విషయాలను వివరించాలి. జ్ఞానేశ్వర్ గెలుపు కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలి.

- దయానంద్‌గుప్తా, ఎమ్మెల్సీ

## కేసీఆర్‌కు కానుక ఇద్దాం



ప్రధాని మోదీ నోట్లు రద్దు చేసినప్పుడు నల్లధనం తీసుకొచ్చి ఒక్కొక్క రైతు అకౌంట్లో రూ.15 లక్షలు వేస్తామని చెప్పారు. అవి వేశాకే ఓటు వేస్తామని ప్రజలు చెప్పాలి. రూ.400 పైచిలుకు ఉన్న గ్యాస్ రూ.1200 అయ్యిందంటే.. అది బీజేపీ వాళ్ల పుణ్యమే. పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి సామాన్యుడిని ఇబ్బందులు పెడుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త ఇవన్నీ ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలి. సమష్టి కృషితో విజయం సాధిద్దాం. కార్యకర్తలకు ఎక్కడ ఏ చిన్న ఇబ్బంది ఉన్నా.. అండగా ఉంటాం. బీఆర్ఎస్ కార్యకర్తల శక్తిని తక్కువగా అంచనా వేసి రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారు. మన శక్తి ఏమిటో చూపించాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ ఎన్నికలను ప్రతి కార్యకర్త చాలెంజ్‌గా తీసుకోవాలి. చేవెళ్ల ఎంపీగా కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించి.. కేసీఆర్‌కు కానుక ఇద్దాం.

-సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎమ్మెల్సీలు దయానంద్‌గుప్తా, వాణీదేవి, చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్

# తెలంగాణ అంటేనే కేసీఆర్

### కాంగ్రెస్, బీజేపీకి బుద్ధి చెప్పాలి
### కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
### మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

షాబాద్, ఏప్రిల్ 1: తెలంగాణ అంటేనే కేసీఆర్.. ప్రజలు బాగుండాలని నిరంతరం ఆలోచించే ఏకైక వ్యక్తి ఆయన అని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. కేసీఆర్ నిశానా చెరిపేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని, అది సాధ్యమయ్యేది కాదని చెప్పారు. సోమవారం చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్‌లో స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య అధ్యక్షతన అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి సబితాఇంద్రారెడ్డి, చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, ఎమ్మెల్సీలు దయానంద్‌గుప్తా, సురభి వాణీదేవి, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ...96 కులాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి.. ఆ కులాల సమస్యలను అప్పటి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఘనత కాసాని జ్ఞానేశ్వర్‌కే దక్కుతుందన్నారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని, కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించారు. సీఎం రిలీఫ్ ఫండ్ అంటే ఒక భరోసా ఉండేదని, మూడు నెలల నుంచి సీఎం రిలీఫ్ ఫండ్ ఇవ్వడం లేదన్నారు. దీంతో రాష్ట్రంలో పాలన ఏ విధంగా సాగుతున్నదో ప్రజలు ఆలోచించాలన్నారు. బీఆర్ఎస్ నుంచి ఎవరూ ఎక్కడకు పోయినా.. 60 లక్షల మంది సైన్యం కేసీఆర్ వెంటే ఉన్నారన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదా మరిచి మాట్లాడుతున్నారని, ఇంకా పీసీసీ అధ్యక్షుడిగా, ప్రతిపక్ష నాయకుడిగానే మాట్లాడే విషయాన్ని ప్రజలందరూ గమనిస్తున్నారని చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసి చేవెళ్లకు సాగునీరు రావాలంటే చేవెళ్ల గడ్డపై ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలవాలన్నారు. మోదీని చూసి ఓటు వేయమని బీజేపీ నాయకులు అడుగుతున్నారని, దేవుడి పేరు, మతం పేరు చెప్పుకొని పబ్బం గడుపుకోవడం తప్ప.. ప్రజలకు ఏమైనా చేయాలన్న ఆలోచన బీజేపీ వాళ్లకు లేదన్నారు. బీజేపీకి తెలంగాణపై అంతా ప్రేమ ఉంటే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలన్నారు. ఈ నెల 13న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేవెళ్లకు వస్తున్నారని వెల్లడించారు. ఈ సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి, జడ్పీటీసీలు పట్నం అవినాశ్‌రెడ్డి, కాలె జయమ్మ, గోవిందమ్మ, కాలె శ్రీకాంత్, ఎంపీపీలు గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాసాని గొప్ప వ్యక్తి



96 కులాలను కలుపుకొని వ్యవస్థను నడిపించిన కాసాని జ్ఞానేశ్వర్ గొప్ప వ్యక్తి. కార్యకర్తలందరూ కలిసికట్టుగా పనిచేసి బీఆర్ఎస్ విజయానికి కృషి చేయాలి. ప్రతిపక్షాలు మాట్లాడే మాటలన్నీ నీటిమీద రాతలాంటివి. పదేండ్లలో కరెంట్, తాగునీరు, విద్య, వైద్యం తదితర విషయాల్లో తెలంగాణ దేశానికే దిక్సూచిగా నిలిచింది.

-సురభి వాణీదేవి, ఎమ్మెల్సీ

# రాగిడి.. పక్కా లోకల్

### ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 1 : మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో పోటీ చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు నాన్ లోకల్ అని.. పక్కా లోకల్ అయిన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని ఆదరించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఓటర్లను కోరారు. సోమవారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేపీహెచ్‌బీ కాలనీ మొదటి రోడ్డులోని జీహెచ్‌ఎంసీ పార్కుతో పాటు పలు పార్కుల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే కృష్ణారావు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం, నగరం శరవేగంగా అభివృద్ధి చెందిందన్నారు. కాలనీలు, బస్తీల్లో రోడ్లు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించి అంతరాయం లేని విద్యుత్‌తో పాటు అవసరాలకు సరిపడా తాగునీటిని అందించినట్లు వివరించారు. వేలాది కోట్లతో చేసిన అభివృద్ధి పనులు కండ్ల ముందే కనబడుతున్నాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కృష్ణారావు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శిరీషాబాబూరావు, మందడి శ్రీనివాస్‌రావు, జూపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### నేడు శామీర్‌పేట్‌కు కేటీఆర్

మేడ్చల్: శామీర్‌పేట్‌కు మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రానున్నారు. స్థానిక సీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా జరిగే సమావేశంలో కేటీఆర్ పాల్గొననున్నారు. కాగా, రైతులకు ఇచ్చిన హామీని అమలు చేయాలంటూ.. బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనలు చేపట్టనున్నారు. ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ అందించాలని నేడు కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేయనున్నారు.


కేపీహెచ్‌బీ కాలనీలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి లక్ష్మారెడ్డి తదితరులు

# ఎర్లీబర్డ్ బంపర్ ఆఫర్



### 30లోపు ఆస్తిపన్ను చెల్లించే వారికి 5% రాయితీ
### జోన్లకు రూ. 800 కోట్ల లక్ష్యం ఖరారు
### తొలిరోజు బల్దియాకు రూ.9 కోట్ల ఆదాయం

సిటీబ్యూరో, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ వాసులకు బల్దియా ఎర్లీబర్డ్ స్కీంను అందుబాటులోకి తీసుకొచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్నును ఒకేసారి చెల్లిస్తే 5 శాతం రాయితీని ప్రకటించింది. ఈ ఎర్లీబర్డ్ ఆఫర్‌ను గృహ, వ్యాపార సముదాయాల యజమానులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ నెల 30వ తేదీ వరకు ఆస్తిపన్ను చెల్లించిన వారికే ఈ 5 శాతం రాయితీ ఉంటుందని స్పష్టం చేశారు. కాగా, ఎర్లీబర్డ్ పథకం కింద రూ. 800కోట్ల నిర్దేశిత లక్ష్యాన్ని ఖరారు చేయగా, తొలిరోజు సోమవారం బల్దియా రూ. 9 కోట్లకు పైగా ఆదాయాన్ని సమకూర్చుకున్నది.

# ఆస్తి పన్ను.. ఆశాజనకం

### గతంలో కంటే అదనంగా రూ. 257 కోట్లు వసూలు
### సమష్టి కృషి ఫలితంగానే.. బల్దియా కమిషనర్ రోనాల్డ్ రాస్



**జీహెచ్ఎంసీ** గతేడాది గణాంకాలను అధిగమించి 2023-24 ఆర్థిక సంవత్సరంలో అద్భుతంగా ఆస్తిపన్ను వసూళ్లను సాధించినట్లు కమిషనర్ రోనాల్డ్ రాస్ పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో పోలిస్తే ఈ ఏడాది రూ. 257కోట్లకు పైగా అదనంగా వసూలైనట్లు వెల్లడించారు. 2023-24 సంవత్సరం సవరించిన బడ్జెట్ అంచనాల మేరకు రూ.1810 కోట్లు కాగా, ఇప్పటి వరకు రూ.1917 కోట్ల పన్ను వసూలైందన్నారు. గత సంవత్సరం 2022-23లో ఆస్తిపన్ను సేకరణ రూ.1660 కోట్లతో పోలిస్తే 15.5 శాతం పెరిగిందన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరం వరకు ఆస్తిపన్ను బకాయిలపై వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకం అమలు ద్వారా ఆస్తిపన్నుపై 90 శాతం వడ్డీ మాఫీని ప్రారంభించడంతో మంచి ఫలితాలు వచ్చాయని కమిషనర్ తెలిపారు. పన్ను చెల్లింపుదారులను ప్రోత్సహించడంతో ఈ ఏడాది దాదాపు రూ.300కోట్ల పన్ను వసూళ్లు జరిగిందన్నారు. ఆర్థిక సంవత్సరం చివరి రోజు ఆదివారం రూ.123 కోట్ల రూపాయల పన్ను వసూళ్లు నమోదు చేసినట్లు తెలిపారు. బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు పలువురు బీఎల్‌వోలు, బీఎల్‌వో సూపర్‌వైజర్ల వంటి కీలకమైన ఎన్నికల విధులు నిర్వహిస్తున్నప్పటికీ లక్ష్యాన్ని అధిగమించామని వివరించారు.

## ప్రకటనల రూపంలో రూ.60 కోట్ల ఆదాయం



ప్రకటనల రూపంలో జీహెచ్ఎంసీ రికార్డు స్థాయి ఆదాయాన్ని సమకూర్చుకున్నది. గతంలో ఎన్నడూ లేని విధంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికిగానూ రూ. 60కోట్ల మేర ప్రకటన రూపంలో ఆదాయాన్ని రాబట్టుకున్నది. గత ఐదేండ్లుగా ఏడాదిలో సరాసరిగా రూ. 18కోట్ల మేర ఆదాయం వచ్చేది. కానీ ఒకే ఏడాదిలో రూ.60కోట్ల మేర ఆదాయం రావడం ఇదే ప్రప్రథమని ఈవీడీఎం అధికారులు తెలిపారు. ఇటీవల కాలంలో అడ్వర్టయిజ్‌మెంట్ విభాగంలో ప్రక్షాళన, మెట్రో అధికారులతో సమన్వయం, పాత బకాయి వసూళ్లలో స్పెషల్ డ్రైవ్ వంటి అంశాలతోనే గణనీయమైన ఆదాయం వచ్చిందన్నారు.

### ఎర్లీబర్డ్ పథకం వివరాలు

| సంవత్సరం | సద్వినియోగం చేసుకున్న వారు | వచ్చిన ఆదాయం (రూ.కోట్లలో) |
|---|---|---|
| 2019-20 | 492528 | 538.26 |
| 2020-21(ఏప్రిల్-మే) | 520443 | 576.75 |
| 2021-22(ఏప్రిల్-మే) | 592609 | 541.7 |
| 2022-23 | 726806 | 742.39 |
| 2023-24 | 736035 | 787.11 |



# ఎన్‌ఫోర్స్‌మెంట్.. మరింత పటిష్టంగా

### 250 మందికిపైగా పోలీస్ సిబ్బందితో భర్తీ
### డీఐజీ ర్యాంకు అధికారి, ఇద్దరు డీఎస్పీల నియామకం

సిటీబ్యూరో, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణే లక్ష్యంగా ఏర్పాటైన హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని బలోపేతం చేసేందుకు మెట్రో పాలిటన్ కమిషనర్ చర్యలు చేపట్టారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఔటర్ రింగు రోడ్డు దాటి.. చుట్టూ ఉన్న 7 జిల్లాల పరిధిలోకి విస్తరిస్తోంది. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రస్తుతం ఉన్న హెచ్ఎండీఏ పరిధిని రీజినల్ రింగు రోడ్డు వరకు విస్తరించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో పరిధి గణనీయంగా పెరుగుతుండటంతో అదేస్థాయిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్నదని ఉన్నత స్థాయిలో జరిగిన సమీక్షల్లో గుర్తించారు. ప్రధానంగా హెచ్ఎండీఏ భూములు వివిధ ప్రాంతాల్లో సుమారు 8వేల ఎకరాల వరకు ఉండగా, ఏటా భవన నిర్మాణ అనుమతులు, లే అవుట్ల అనుమతులు వేల సంఖ్యలో వచ్చే అవకాశం ఉండటంతో భద్రతాపరమైన ఏర్పాట్లు చాలా కీలకమని గుర్తించారు. ప్రస్తుతం ఒక డీఎస్పీ స్థాయి అధికారి, ఒక సీఐ, మరొక ఎస్ఐ, పదుల సంఖ్యలోనే కానిస్టేబుళ్లు, హోంగార్డులు విధుల్లో ఉన్నారు. వీరితో హెచ్ఎండీఏ పరిధిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని సమర్థవంతంగా నిర్వహించలేమని, ఐపీఎస్ ర్యాంకు కలిగిన అధికారి, అదనపు సిబ్బంది ఉండాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే జీహెచ్ఎంసీలో ఐపీఎస్ ర్యాంకు అధికారి నేతృత్వంలో ఎన్స్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఉన్నట్లే, హెచ్ఎండీఏలోనూ అదే స్థాయిలో పోలీసుల బలగాలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌ను ఏర్పాటు చేసేందుకు హెచ్ఎండీఏ చర్యలు చేపట్టింది. డీఐజీ స్థాయి ర్యాంక్ అధికారి నుంచి మొదలుకొని.. మొత్తం 250 మందికిపైగా పోలీసు శాఖకు చెందిన అధికారులు, సిబ్బందిని హెచ్ఎండీఏకు తీసుకురానున్నారు. ఈ మేరకు ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపినట్లు అధికారులు తెలిపారు. పోలీసు బలగాలతో కూడిన ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఎంత బలంగా ఉంటే అంతే పటిష్టంగా క్షేత్ర స్థాయిలో హెచ్ఎండీఏ పరిరక్షణతో పాటు అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లల్లో అక్రమాలపై చర్యలు తీసుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

| | |
|---|---|
| డీఐజీ ర్యాంక్ అధికారి | 1 |
| డీఎస్పీలు | 2 |
| సీఐలు | 4 |
| ఎస్ఐలు | 8 |
| కానిస్టేబుళ్లు | 200 |
| హోంగార్డులు | 40 |

### హెచ్ఎండీఏ 'అర్బన్ ఫారెస్ట్'లో బదిలీలు

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోని అర్బన్ ఫారెస్ట్రీ విభాగంలో బదిలీలు చేపట్టారు. అటవీ శాఖ నుంచి డిప్యుటేషన్‌పై వచ్చి, వివిధ హోదాల్లో విధులు నిర్వర్తిస్తున్న వారిని బదిలీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఔటర్ రింగు రోడ్డుతో పాటు నగరంలోని హుస్సేన్‌సాగర్, పలు పార్కులు, నగర శివారు ప్రాంతాల్లో చేపట్టిన అర్బన్ ఫారెస్ట్ పార్కులను విజయవంతంగా చేపట్టడంలో హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ విభాగం అధికారులు క్షేత్ర స్థాయిలో కీలకంగా పనిచేశారు. హైదరాబాద్ మహానగరానికి మణిహారంగా ఉన్న ఔటర్ రింగు రోడ్డు 158 కి.మీ. పొడవునా పచ్చదనం పెంపొందించేందుకు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో నిరంతర పర్యవేక్షణ, పచ్చదనం ఉండేలా అర్బన్ ఫారెస్ట్రీ విభాగం నిర్వహణను చేపట్టింది. అయితే, చాలా ఏండ్లుగా డిప్యుటేషన్‌పై ఉన్న అటవీ శాఖ అధికారులను బదిలీ చేసినట్లు ఆదేశాలు వచ్చినా.. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ఈ అంశాన్ని పెండింగ్‌లో పెట్టినట్లు సమాచారం.